క్లుప్తంగా

పేద మహిళలకు చీరలు పంపిణీ


మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి

నర్సీపట్నం: నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి తన వార్డులోని పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. వార్డు ప్రజలు, మున్సిపల్ అధికారులతో కలిసి తన నివాసంలో నూతన సంవత్సర వేడుకలను జరుపుకున్నారు. ఇందులో భాగంగా తన వార్డులో నిరుపేదలైన 200 మంది మహిళలకు చీరలు పంపిణీ చేసి ఉదారతను చాటుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యురాలు షేక్ రోజా పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మేలుకొలుపులు


సత్యవరంలో మేలుకొలుపు నిర్వహిస్తున్న మహిళలు

మాడుగుల: మండలంలో మాడుగుల, సత్యవరం, జేడీపేట, వీరనారాయణం, కింతలి, ఒమ్మలి గ్రామాల్లో ఆదివారం మేలుకొలుపులు కార్యక్రమం నిర్వహించారు. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా తెల్లవారుజాము నుంచి పార్థసారథి స్వామి, సీతారాములు చిత్రపటాలను పురవీధుల్లో ఊరిగించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

శరవేగంగా కొవ్వూరులో రామ మందిర నిర్మాణం


రామ మందిర నిర్మాణ పనులు

రోలుగుంట: కొవ్వూరులో రామ మందిరం నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. ఇక్కడ రామ మందిరం శిథిలం కావడంతో గ్రామస్తులతో ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, సర్పంచ్ కాంతమ్మ ఇటీవల సమావేశమయ్యారు. అందరూ సమష్టిగా ఆలయాన్ని నిర్మించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు విరాళాలు సేకరించి నిర్మాణ పనులు చేపట్టారు. గ్రామానికి చెందిన అభయాంజనేయ భక్త బృందం శ్రమదానంతో పనులు వేగవంతం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రామ మందిర నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసి ఈ నెల 22న అయోధ్యలో రామ మందిరంతోపాటు ఇక్కడ ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

అనకాపల్లి: గ్రీన్‌క్లబ్ ద్వారా పర్యావరణ పరిరక్షణ, జాగృతి కార్యక్రమాలను క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ చేపట్టడం అభినందనీయమని సంఘ సేవకులు కర్రి సన్యాసినాయుడు అన్నారు. స్థానిక మార్కెట్ యార్డులో సోమవారం క్లబ్ 9వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లబ్ కృషి ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు. కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ మాట్లాడుతూ దేశం, ప్రకృతి, ప్రపంచం క్షేమంగా ఉండాలని ఆకాంక్షించారు. పర్యావరణ పరిరక్షణతో భవిష్యత్ మానవాళి మనుగడ ఆధారపడి ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణపై క్లబ్ సభ్యులు ప్రతిజ్ఞ చేశారు. అంతకు ముందు క్లబ్ డైరీని ఆవిష్కరించి, పర్యావరణ హిత జ్యూట్ బ్యాగ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అటవీశాఖ మాజీ అధికారి బీరా వినోద్‌కుమార్, గౌరవాధ్యక్షులు పెంటకోట ఉమామహేశ్వరరావు, యల్లపు సూరి అప్పారావు, సభ్యులు కాండ్రేగుల సత్యనారాయణ, కర్రి హనుమంతరావు, నైశెట్టి సత్తిబాబు, బేతాళం శేషసాయి, వీఎస్ఎస్ రామకృష్ణ, గంట్ల కృష్ణ, కుంచం నూకయ్యశెట్టి తదితరులు పాల్గొన్నారు.

5న వయో వృద్ధుల సంఘ సమావేశం

అనకాపల్లి: పట్టణంలోని వీవీ రమణ రైతు భారతి హాలులో 5న జిల్లా వయోవృద్ధుల సంక్షేమ సంఘ సమావేశం నిర్వహించనున్నట్లు సంఘ వ్యవస్థాపకుడు కాండ్రేగుల అప్పారావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 60 సంవత్సరాలు దాటిన వృద్ధులకు గుర్తింపు కార్డులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

ప్రస్తుత డిజిటల్ యుగంలో అన్ని రంగాల్లో సాంకేతిక కొత్త పుంతలు తొక్కుతోంది. ఈ నేపథ్యంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో దూరదృష్టితో ఆలోచించి ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్నారు. దీనివల్ల డిజిటల్ బోధనతో వారిలో టెక్నికల్ పరిజ్ఞానం పెరుగుతోంది. కార్పొరేట్ దీటుగా నైపుణ్యాలను పెంపొందించుకుని చదువులో రాణిస్తారు.



టిప్ టాప్ ట్యాబ్‌గా స్కూల్‌కు..

- సర్కారు బడుల్లో డిజిటల్ పాఠాలు
- రెండేళ్లుగా ట్యాబ్‌లు అందిస్తున్న ప్రభుత్వం
- మొదటగా 8వ తరగతి విద్యార్థులకు పంపిణీ


ఈ ఏడాది మంజూరైన ట్యాబ్‌లను విద్యార్థులకు అందజేస్తున్న ఎంపీపీ సత్యనారాయణ

మాకవరపాలెం: పేదపిల్లల విద్యాభివృద్ధికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యమిస్తోంది. పైసా ఖర్చు లేకుండా కార్పొరేట్ స్థాయి విద్యా ప్రమాణాలను అందిస్తోంది. డిజిటల్ బోధనను అందించేందుకు బైజూస్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుని ఆ సంస్థ అందించే పాఠాలను ట్యాబ్‌ల్లో పొందుపరిచింది. అన్ని సబ్జెక్టులకు సంబంధించిన పాఠాలను ఈ ట్యాబ్‌ల్లో నిక్షిప్తం చేసి విద్యార్థులకు అందిస్తోంది.

ఎస్డీ కార్డుల్లో పాఠాల అప్లోడ్...

విద్యార్థులకు పంపిణీ చేసిన ట్యాబ్‌ల్లోని ఎస్డీ కార్డుల్లో తెలుగు, హిందీ, ఉర్దూ, ఇంగ్లిష్‌తోపాటు ఆరు భాషల్లో కంటెంట్ లభ్యమయ్యేలా చర్యలు తీసుకుంది. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, గణితం, సోషల్ పాఠాలను విద్యార్థులు సులువుగా అర్థం చేసుకునేలా వీడియో, ఆడియోలను రూపొందించారు. ఈ బైజూస్ కంటెంట్‌తో బోధన సాగించేందుకు ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చింది.

మండలం పేరు : మాకవరపాలెం	
కేజీబీవీ 1	2022-23 ఏడాదిలో ఇచ్చిన ట్యాబ్‌ల సంఖ్య 429
జెడ్పీ హైస్కూళ్లు 5	
యూపీ స్కూళ్లు 8	2023-24 ఏడాదిలో ఇచ్చిన ట్యాబ్‌ల సంఖ్య 403


మాకవరపాలెం ఉన్నత పాఠశాలలో ట్యాబ్‌లతో చదువుతున్న విద్యార్థులు

అంతే కాకుండా ఈ విద్యార్థులు 9, 10 తరగతులకు వెళ్లగానే అప్పటి పాఠాలకు సంబంధించిన కంటెంట్‌ను మరలా అప్‌లోడ్ చేస్తారు. ప్రధానంగా విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించడమేగాక ఆంగ్లంలో పట్టు, నైపుణ్యాలను సాధించాలనే లక్ష్యంతో వీటిని అందిస్తోంది.

స్విప్‌చాట్ యాప్‌తో ఎంతో ఉపయోగం



మాకు ఇచ్చిన ట్యాబ్‌ల్లో స్విప్‌చాట్ యాప్ ఎంతో ఉపయోగపడుతోంది. ఈ యాప్ ద్వారా ఇంగ్లిష్‌పై పట్టు సాధించేందుకు ఎంతో దోహదపడుతుంది. ఆంగ్లంలో వెనుకబడి ఉన్న వారికి ఈ యాప్‌తో మంచి ఫలితాలను ఇస్తుంది.

– ఎస్.జగదీశ్వరరావు, 9వ తరగతి విద్యార్థి

సులువుగా అర్థం చేసుకోవచ్చు



ఉపాధ్యాయులు బోధించే పాఠశాలు అర్థం కాకపోతే ట్యాబ్‌లో చూసుకోవచ్చు. ట్యాబ్‌లు అందించడం వల్ల మరొక్కసారి పాఠాన్ని వీడియో ద్వారా వినడంతో ఎంతో సులువుగా అర్థమవుతోంది.

– రొంగలి చరిష్మ, 8వ తరగతి విద్యార్థి

యాప్‌తో ప్రయోజనం



ఈ ఏడాది నుంచి ట్యాబ్‌ల్లో ఈ పాఠశాల యాప్ అప్‌లోడ్ చేశారు. ఈ యాప్‌లో తెలుగు, హిందీ, ఇంగ్లిష్‌కు సంబంధించి పాఠాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. 3 నుంచి 9వ తరగతి వరకు పాఠాలు ఉండటం వల్ల ఈ పాఠశాల యాప్‌తో ప్రయోజనం ఉంది.

– బి.నాగజ్యోతి, 9వ తరగతి విద్యార్థి

విద్యార్థుల కష్టాలు తెలుసుకున్న సీఎం



పేద విద్యార్థుల కష్టాలను తెలుసుకున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి థాంక్స్. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మాలాంటి పేద విద్యార్థులకు ఉన్నత విద్య అందిస్తున్నారు. సీఎం నిర్ణయంతోనే మంచి విద్యనభ్యసిస్తున్నాం.

– జి.వంశీకృష్ణ, 8వ తరగతి విద్యార్థి

నేటి నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు

- రెండో విడత కార్యక్రమాలకు ఏర్పాట్లు పూర్తి

దేవరాపల్లి: జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత శిబిరాన్ని బోయిలకింతాడలో మంగళవారం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మి తెలిపారు. స్థానిక సర్పంచ్ బూరె బాబూరావు అధ్యక్షతన జరిగే ఈ శిబిరానికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు హాజరవుతారన్నారు. స్థానికులంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతీ మంగళవారం సురక్ష క్యాంప్‌లు నిర్వహిస్తామన్నారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

మాడుగుల రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత శిబిరాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయని కె.జె.పురం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎల్. శివప్రసాదుపాత్రుడు సోమవారం తెలిపారు. మంగళవారం మాడుగుల -2 ఆరోగ్య ఉప కేంద్రం పరిధిలో ఆర్సీఎం పాఠశాలలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ నెల 19న మాడుగుల -3 ఆరోగ్య ఉప కేంద్రం పరిధి, 30న ఆరోగ్య ఉప కేంద్రం -1 పరిధిలో సురక్ష శిబిరాలు ఉంటాయన్నారు.

5 నుంచి ఏప్రిల్ 12 వరకూ..

రోలుగుంట: రోగులకు మేలు చేయడంలో భాగంగా ఈ నెల 5 నుంచి ఏప్రిల్ 12వ తేదీ వరకు రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను నిర్వహించనున్నట్టు ఈవోపీఆర్డీ కె.నూకరాజు సోమవారం తెలిపారు. ఈ నెల 5న కొండపాలెం, 12న నిండుగొండ, 19న కొవ్వూరు, 27న కె.నాయుడుపాలెం, ఫిబ్రవరి 2న కొంతలం, 9న కొమరవోలు, 16న రత్నంపేట, 23న శరభవరం, మార్చి-4న అడ్డసరం, 15న జానకిరాంపురం, 22న కుసుర్లపూడి, 30న ఎం.కె.పట్నం, ఏప్రిల్-6న గుండుబాడు, అదే నెల 12వ తేదీతో జగ్గంపేటలో ఈ కార్యక్రమాలు ముగుస్తాయన్నారు. అన్ని విభాగాల వైద్యనిపుణులు రోగులను పరీక్షిస్తారన్నారు.

నెరవేరిన 20 ఏళ్లనాటి కల

వరహాపురం– పెదగోగాడ తారురోడ్డు నిర్మాణం పూర్తి


వరహాపురం,పెదగోగాడ తారురోడ్డు


శిథిలమైన వరహాపురం,పెదగోగాడ తారురోడ్డు(ఫైల్)

చీడికాడ: మండలంలోని చీడికాడ– చోడవరం ప్రధాన రహదారికి లింకురోడ్డుగా ఉన్న వరహాపురం – పెదగోగాడ తారురోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ప్రస్తుత డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు 20 ఏళ్ల క్రితం కాంట్రాక్టర్‌గా వ్యవహరించినప్పుడు ఈ రోడ్డును తారురోడ్డుగా నిర్మించారు. నాటి నుంచి నేటి వరకు ఎటువంటి మరమ్మతులకు నోచుకోలేదు. దాంతో మూడున్నర కిలోమీటర్ల మేర రోడ్డు శిథిలమై గుంతలు పడింది. తాజాగా ఆయన రూ.1.50 కోట్లు మంజూరు చేయడంతో ఈ రోడ్డుకు మోక్షం లభించింది. నెలరోజుల నుంచి రోడ్డు పనులు శరవేగంగా సాగుతూ నేటికీ పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ఆయా గ్రామస్తులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, డిప్యూటీ సీఎంకు కృతజ్ఞతలు చెబుతున్నారు.

అయోధ్య అక్షింతల పంపిణీ


అయోధ్య అక్షింతలను అందజేస్తున్న ఆర్డీవో జయరాం దంపతులు


ముకుందపురంలో అయోధ్య అక్షింతల పంపిణీలో పాల్గొన్న భక్తులు


అక్షింతలు పంపిణీ చేస్తున్న వీహెచ్‌పీ సభ్యులు

నర్సీపట్నం: అయోధ్య నుంచి తీసుకొచ్చిన అక్షింతలతో పట్టణంలో శోభాయాత్రను సోమవారం వేడుకగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో హెచ్.వి.జయరాం దంపతులు పాల్గొన్నారు. బాల వినాయక ఆలయంలో అక్షింతలకు ప్రత్యేక పూజలు చేశారు. అక్షింతలు పంపిణీలో భాగంగా ఆర్డీవో దంపతులు వ్యాపారి వెలగా నారాయణరావు దంపతులకు అందజేశారు.

మాడుగుల రూరల్: ముకుందపురంలో అయోధ్య అక్షింతల పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. సర్పంచ్ కర్రి గణేశ్, మాజీ సర్పంచ్ గుడాల వెంకటరత్నం, బాలిబోయిన కాశీ, పెమ్మే శ్రీనివాసరావు, భజన భక్తుల సారథ్యంలో మండల ప్రముఖ్ రాపేట రామకొండలరావు పర్యవేక్షణలో కార్యక్రమం నిర్వహించారు. వంటర్లపాలెం రామాలయంలో ప్యాకెట్ల రూపంలో అక్షింతలు పంపిణీ చేశారు. ధర్మ రక్షణ సమితి సభ్యులు, మాజీ సర్పంచ్ కుమార రాజు, ఆలయ ప్రధాన అర్చకుడు కోనేటి లక్ష్మణరావు పాల్గొన్నారు.

రావికమతం: మండలంలోని పిల్లవానిపాలెం, గుడ్డిప, మట్టవానిపాలెం, కుముందానిపేట, దొండపూడి గ్రామాల్లో ఇంటింటికీ అయోధ్య రాముని అక్షింతలు పంపిణీ కార్యక్రమం సోమవారం అట్టహాసంగా నిర్వహించారు. ఈ నెల 22న అయోధ్యలో బాల రాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ సభ్యులు ఈ కార్యక్రమాన్ని సంబరంగా చేపట్టారు. అయోధ్య రామాలయం చరిత్ర కలిగిన కరపత్రాలను పంపిణీ చేశారు.

వైకుంఠ వాసునిగా ఉపమాక వెంకన్న


ఉపమాకలో భక్తులకు వైకుంఠవాసునిగా దర్శనమిస్తున్న స్వామివారు

నక్కపల్లి: ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆంగ్ల నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని సోమవారం స్వామివారిని వైకుంఠ వాసునిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ధనుర్మాసంలో ఏకాదశినాడు ప్రారంభమైన రాపత్తు అధ్యయనోత్సవాల చివరి రోజైన సోమవారం ఉదయం స్వామివారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం పరమ పదం ఉత్సవం నిర్వహించారు. శ్రీదేవీ , భూదేవీ సమేత వేంకటేశ్వర స్వామివారిని వైకుంఠ వాసునిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. నమ్మాళ్వార్లు, రామానుజుల వారిని సప్పరం వాహనంపై అలంకరించి స్వామివారికి అభిముఖంగా ఉంచి తిరువీధి సేవ నిర్వహించారు. సోమవారం పరమపదం ఉత్సవం నిర్వహించడంతో రాపత్తు అధ్యయనోత్సవాలు ముగిసినట్టేనని ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ తెలిపారు.

సరికొత్త జోష్

నూతన సంవత్సర వేడుకలు వాడవాడలా అంబరాన్నంటాయి. 2023కు వీడ్కోలు చెబుతూ.. 2024కు స్వాగతం పలుకుతూ.. హంగామా చేశారు. చిన్నాపెద్దా తారతమ్యం లేకుండా అంతా ఎంతో సంతోషంగా పాల్గొన్నారు. ఆదివారం అర్ధరాత్రి 12 గంటలకు కేక్ కట్ చేసి, బాణసంచాలు కాల్చి సందడి చేశారు. సోమవారం ఉదయం నుంచి ప్రభుత్వ, పార్టీ కార్యాలయాల్లో కేక్‌లు కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టి వేడుకలు నిర్వహించారు.


గోవాడ చర్చిలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీని సన్మానిస్తున్న పాస్టర్లు

- అంబరాన్నంటిన కొత్త సంవత్సర వేడుకలు
- పలువురికి శుభాకాంక్షల వెల్లువ
- సందడిగా ప్రభుత్వ, పార్టీ కార్యాలయాలు


ఎమ్మెల్యే గణేష్‌కు మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న డీఎఫ్‌వో లక్ష్మణ్, సిబ్బంది


చోడవరంలో ధర్మశ్రీకి శుభాకాంక్షలు చెబుతున్న రావికమతం మండల ప్రజాప్రతినిధులు


ఎం. కోడూరు పీఏసీఎస్‌లో సహకార డైరీని ఆవిష్కరిస్తున్న పర్సన్ ఇన్‌చార్జి గొల్లవిల్లి రాజేష్

చోడవరం/రావికమతం: చర్చిల్లో క్రైస్తవులు ఆదివారం రాత్రి నుంచే ప్రత్యేక ప్రార్థనలు చేసి కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. మరో పక్క యువత వివిధ కార్యక్రమాలతో సందడి చేసింది. మహిళలు తమ ఇళ్ల ముందు వేసిన రంగవల్లులు ఆకట్టుకున్నాయి. చోడవరం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. చోడవరం, బుచ్చెయ్యపేట, రావికమతం, రోలుగుంట మండలాల నుంచి వందలాది మంది కార్యకర్తలు వచ్చి ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పెద్ద ఎత్తున కార్యకర్తలు, అభిమానులు తరలిరావడంతో కార్యాలయం ఎంతో సందడిగా మారింది. నూతన సంవత్సరంలో అంతా ఆనందంగా సోదరభావంతో కలిసి ఉండాలని ఎమ్మెల్యే ధర్మశ్రీ ఆకాంక్షించారు. చోడవరం తహసీల్దార్ తిరుమల రావు, ఎంపీపీ గాడి కాసు, ఎంపీడీవో శ్యామ్‌సుందర్, ఈవోపీఆర్డీ చైతన్య, సీఐ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మారిశెట్టి విజయ శ్రీకాంత్‌లను అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గోవాడ చర్చిలో ధర్మశ్రీ పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీలో ఎండీ సన్యాసినాయుడుకు కార్మికులు, యాజమాన్య సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

కొత్త వెలుగులు నింపాలి : ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: ప్రజలు 2024లో సుఖ సంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఆకాంక్షించారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన న్యూయర్ కేక్ కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, మున్సిపల్ కమిషనర్ పూడి రవిబాబు, డీఎఫ్‌వో జి.లక్ష్మణ్, ఏఎస్‌డబ్ల్యూవో శ్యామల, నాలుగు మండలాలకు చెందిన ఎంపీపీలు సుర్ల రాజేశ్వరి, మణికుమారి, రుత్తల సత్యనారాయణ, సాగిన లక్ష్మణమూర్తి, పార్టీ అధ్యక్షులు ఏకాశివ, సుర్ల సత్యనారాయణ, లెక్కల సత్యనారాయణ, లగుడు నాగేశ్వరరావు, రుత్తల శ్రీనివాస్, పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి బొడ్డు గోవింద్, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, పలు శాఖల అధికారులు, మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

మాడుగుల/మాడుగుల రూరల్: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ వేమవరపు రామధర్మజ భారీ కేక్ కట్ చేసి అధికారులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీవో మీనాకుమారి, తహసీల్దార్ పీవీరత్నం, డీటీ సత్యనారాయణ, ఐసీడీఎస్ పీవో శ్రీదేవి, తదితరులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు చెప్పారు. జేడీపేటలో వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్‌కు మండలంలో పంచాయతీ కార్యదర్శులు, వెలుగు సిబ్బంది, ప్రజా ప్రతినిధులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎం. కోడూరు పీఏసీఎస్‌లో సహకార డైరీని పర్సన్ ఇన్‌చార్జి గొల్లవిల్లి రాజేష్ ఆవిష్కరించారు. సంఘ డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు. కె.జె.పురం పీహెచ్‌సీలో వైద్యాధికార్లు ప్రసాదు పాత్రుడు, లీలాప్రసాదు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలతోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

దేవరాపల్లి: స్థానిక ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరికి ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మికి పంచాయతీ కార్యదర్శులు, తహసీల్దార్ ఎం. లక్ష్మికి వీఆర్వోలు, పీహెచ్‌సీలో వైద్యాధికారి ఇ. పూజ్య మేఘనకు వైద్య సిబ్బంది, ఎస్ఐ డి. నాగేంద్రకు పోలీస్ సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

కె.కోటపాడు: నూతన సంవత్సరం సందర్భంగా ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్‌కు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. చౌడువాడలో పార్టీ నాయకులతో కలిసి వైఎస్సార్‌సీపీ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీరాజు నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి ఆకుల సాయిప్రసాద్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మావరపాలెం: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రుత్తల సత్యనారాయణను ఇన్‌చార్జ్ ఎంపీడీవో సీతామహాలక్ష్మి, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. తామరంలో వైస్ ఎంపీపీ రుత్తల లక్ష్మికి సచివాలయ సిబ్బంది నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

నాతవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి అధికారుల సమక్షంలో కేక్ కట్ చేశారు. తహసీల్దార్ ఎస్.ఎస్.వి. శ్రీనివాస్‌నాయుడు, ఎంపీడీవో హనుమంతరావు, కార్యాలయ సూపరింటెండెంట్ పోలుపర్తి పార్థసారథి, పంచాయతీ విస్తరణాధికారి మూర్తి, ఎంఈవోలు తాడి అమృత్‌కుమార్, కామిరెడ్డి వరహాలబాబు, ఉపాధి హామీ పథకం ఏపీవో చిన్నారావు తమ కార్యాలయాల్లో వేడుకలు నిర్వహించారు.